క్లుప్తంగా

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

మైదుకూరు : మున్సిపాలిటీలో అర్హులకు మంజూరైన కొత్త పింఛన్లను మంగళవారం పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ రాముడు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయం 11.30 గంటలకు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర లబ్ధిదారులకు పింఛన్లను అందజేస్తారని ఆయన పేర్కొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ


పండ్లు, బ్రెడ్లు అంద చేస్తున్న సీఐ ఇబ్రహీం

ప్రొద్దుటూరు క్రైం : ఎస్పీ అన్బురాజన్ పుట్టినరోజు సందర్భంగా టూ టౌన్ సీఐ ఇబ్రహీం ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలోని రోగులకు సోమవారం పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. లేబర్ వార్డులోని బాలింతలు, గర్భిణీలకు, అత్యవసర విభాగం, చిన్న పిల్లల వార్డుతో పాటు ఎంఎస్–1, ఎంఎస్–2–వార్డులు, వృద్ధుల వార్డు, జీఈ వార్డులోని రోగులకు అందచేశారు. తర్వాత ఆస్పత్రి పక్కనే ఉన్న వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐలు రెడ్డిసురేష, భాస్కర్, ఔట్‌పోస్టు ఇన్‌చార్జి షబ్బీర్, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు రాక విద్యార్థుల అవస్థలు


రామేశ్వరంలో రోడ్డుపై వేచిఉన్న విద్యార్థులు

పోరుమామిళ్ల : మండలంలోని కొన్ని గ్రామాలకు ఏర్పాటు చేసిన స్కూలు బస్సు సోమవారం వెళ్లకపోవడంతో ఆయా గ్రామాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బూరగమానుపల్లె, రామేశ్వరం, నాగలకుంట్ల, వెంకటాపురం, అక్కలరెడ్డిపల్లె, ముదిరెడ్డిపల్లె, లింగారెడ్డిపల్లె గ్రామాల విద్యార్థులతో పోరుమామిళ్లకు రావాల్సిన బస్సు సోమవారం నడవకపోవడంతో విద్యార్థులు ఆటోలు, లారీలు పట్టుకోకతప్పలేదు. కళాశాలకు సకాలంలో వెళ్లేందుకు ఆర్టీసీవారు బస్సు నడపాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కలసపాడు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఏపీటీఎఫ్ (257) 2023 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.జె.ప్రేమ్‌కవిత ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఇ.బాలజోజి, ప్రధాన కార్యదర్శి పి.కిరణ్‌కుమార్, జిల్లా కౌన్సిలర్లు కె.క్రిష్టారెడ్డి, ఎ.వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : ఏపీటీఎఫ్(257) 2023 సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం సాయంత్రం ఎంఈఓ రఘురాములు ఆవిష్కరించారు. ఉపాధ్యాయసంఘం అధ్యక్షుడు భాస్కరరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ సురేంద్రనాథ్‌రెడ్డి తదితరులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ఎంఈఓను శాలువాతో సత్కరించారు.

కాశినాయన మండలంలో..

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు డి.శివప్రసాద్‌రెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.భాస్కర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఏపీటీఎఫ్–2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంభూపాల్‌రెడ్డి, రామసుబ్బారావు, బయ్యపురెడ్డి, పీరయ్య, సత్యనారాయణ, సుబ్బారెడ్డి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు


పతకాలు సాధించిన తైక్వాండో క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో అంతర్జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరచి మెడల్స్ సాధించిన శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులను సోమవారం అభినందించారు. కళాశాల విద్యార్థులు బెన్‌హర్ వరప్రసాద్ అంతర్జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో ఫైటింగ్ విభాగంలో సిల్వర్, కటాస్ విభాగంలో బంగారు పతకం, అస్లాం, యజ్ఞేశ్, రుద్రసేనారెడ్డి, వికాస్ ఫైటింగ్, కటాస్ విభాగాలలో ప్రతిభ కనపరచి సిల్వర్ పతకాలు సాధించారు. వీరిని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ చైర్మన్ ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ హరినారాయణ తదతరులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి వేడుకలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి, చెన్నకేశవస్వామి


ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు.


వజ్రపు చీరె, కిరీటధారణలో వాసవీమాత

ప్రొద్దుటూరు కల్చరల్ : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని పలు వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచి భక్తులు వైకుంఠ ద్వారం గుండా స్వామివారి దర్శనం కోసం ఆలయాల వద్ద బారులు తీరారు. స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీమహాలక్ష్మీసమేత చెన్నకేశవస్వామి ఆలయంలో భక్తులు తెల్లవారుజాము 3 గంటల నుంచి ఆలయం వద్ద బారులు తీరారు. లక్ష్మీదేవి, వేంకటేశ్వరుని విగ్రహాల సెట్టింగ్ భక్తులను ప్రత్యేకంగా ఆకట్టుకుంది. చెన్నకేశస్వామి, మహాలక్ష్మీదేవి మూలవిరాట్‌లను గజమాలలతో శోభాయమానంగా అంకరించారు. పోలీసు సిబ్బంది, ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి, సిబ్బంది ఏర్పాట్లును పర్యవేక్షించారు. బొల్లవరంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వెలుపల 400 మీటర్ల మేర భక్తులు క్యూ కట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ గోనా ప్రభాకరరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు. రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వరునికి, స్వామి చెల్లెలు లలితాదేవికి ప్రత్యేక పూజలు అలంకరణ చేశారు. అలాగే అమ్మవారిశాల వీధిలోని ఆత్మారామస్వామి ఆలయంలో సీతారాములు, లక్ష్మణుడు, అంజనేయస్వామి, గోదాదేవి సమేత శ్రీకృష్ణుని దేవతా మూర్తులకు విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో 27వేల వెన్నలడ్డులు పంపిణీ

ప్రొద్దుటూరు ఇస్కాన్ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా 27వేల వెన్నలడ్డూలను పంపిణీ చేశారు.

వజ్రపుచీరలో దర్శనమిచ్చిన వాసవీ మాత

స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో వాసవీమాత వజ్రపు చీర, కిరీటధారై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, గో క్షీరాభిషేకం, కుంకుమార్చనలు, పుష్పార్చన వంటి పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారి గర్భగుడిలో వేకువజామున 108 దీపాలను వెలిగించారు.

మైదుకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి ఆలయంలో, నంద్యాల రోడ్డులోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో, ఎల్లంపల్లె తిరుమలనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక దర్శనం, ఆలంకారాలు చేశారు. తిరుమలనాథస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహించారు.

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థాన సన్నిధిలో తెల్లవారుజామున స్వామికి అభిషేకం చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రత్యేక అభిషేకం, భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు.

అట్లూరు : కమలకూరు రామాలయంలో ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయం నుంచే భజన బృందంచే కార్యక్రమం నిర్వహించారు.

దువ్వూరు : గుడిపాడు గ్రామంలో శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామివారిని ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. ఉత్తరద్వారం ద్వారా స్వామి దర్శనం భక్తులకు కల్పించారు.


అట్లూరు: ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో వీరబ్రహ్మేంద్రస్వామి సోమవారం తెల్లవారుజామున శ్రీలక్ష్మీసమేత శ్రీవిష్ణుమూర్తి అవతారంలో దర్శనం ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అంతకుముందు స్వామి, అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. పూర్వపు మఠాధిపతులు శ్రీవీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి జ్యేష్ఠ పుత్రుడు శ్రీవెంకటాద్రి స్వామి ప్రథమ హారతి ఇచ్చారు. అనంతరం శ్రీగోవిందమాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి శేషశయన వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. జగన్మాత శ్రీఈశ్వరీదేవి మఠం మఠాధిపతులు శ్రీవీరశివకుమారస్వామి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత స్వామి వారి గ్రామోత్సవం కందిమల్లాయపల్లెలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాలను వీరబ్రహ్మేంద్రస్వామి మఠం ఫిట్ పర్సన్ శంకర్‌బాలాజీ పర్యవేక్షణలో మేనేజర్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఉభయదాతలు ప్రొద్దుటూరుకు చెందిన మార్తల గంగిరెడ్డి, నారాయణమ్మ, ధర్మప్రచారకర్త జదీష్, మఠం సిబ్బంది, పుర ప్రముఖులు, శిష్యులు పాల్గొన్నారు.


శ్రీవీరబ్రహ్మేంద్రస్వామిని ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

బద్వేలు అర్బన్ : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఆలయాల్లో భక్తుల తాకిడి కనిపించింది. పట్టణ సమీపంలోని అనంతరాజపురం గ్రామంలో వెలిసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, స్థానిక నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి తెల్లవారుజాము నుంచే భక్తులు బారులుతీరారు. అలాగే సిద్దవటం రోడ్డులోని ఫైర్ ఆఫీస్ వెనుకభాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయంలో, తెలుగుగంగకాలనీలోని అనంతపద్మనాభస్వామి ఆలయాలలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

పోరుమామిళ్ల : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని వైష్ణవాలయాలు భక్తుల గోవిందనామ స్మరణతో కిక్కిరిశాయి. కాలువకట్ట తిరుమలగిరిలో వెలసిన లక్ష్మీదేవి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం, పట్టణంలోని శ్రీ భూదేవి, లక్ష్మీదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు.


పోరుమామిళ్ల : ఉత్తర ద్వార దర్శనంలో స్వామి

కల్యాణం.. కమనీయం


స్వాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


కల్యాణానికి తరలివచ్చిన మహిళలు

వైభవంగా రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణం

రాజుపాళెం : మండలంలోని అర్కటవేముల గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని సోమవారం రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో స్వాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు అర్చకులు చేశారు. క్రిష్టిపాటి వెంకయ్య స్వామి ఆధ్వర్యంలో గ్రామస్తులు, భక్తుల సహకారంతో ఈ కల్యాణాన్ని నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు. ఎంపీటీసీ సభ్యుడు పాతపాటి శివనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ది వెంకటరమణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

- వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వామి ఆలయాల్లో సోమవారం భక్తులు పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే స్వాములకు అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు ఉత్తర ద్వారంలో ఆలయాల్లోకి వెళ్లి స్వాములకు పూజలు చేశారు. ఆలయ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు కానాల బలరామిరెడ్డి, భక్తులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించండి


అల్లాడుపల్లెలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లక్షుమయ్య

చాపాడు : ప్రతి ఏటా పెంఛన్ డబ్బులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెంచుకుంటూ పోతున్నారు. అలాగే ప్రతి ఆరు నెలలకొకసారి కొత్త పింఛన్లు కూడా మంజూరు చేస్తున్న సీఎం జగన్‌ను ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. మండలంలోని అల్లాడుపల్లె గ్రామ సచివాలయంలో సోమవారం నూతనంగా మంజూరైన పింఛన్లు, పెరిగిన పింఛన్ డబ్బులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికలకు ముందుకు సీఎం జగన్ ఇచ్చిన హామీలను నిక్కచ్చిగా అమలు చేస్తున్నారన్నారు. వచ్చే ఏడాది రూ.2,750లు ఉన్న పింఛన్ డబ్బులను రూ.3వేలు చేయనున్నారన్నారు. పింఛన్లు మాత్రమే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు అనేక రకాలైన సంక్షేమ పథకాలను అందిస్తూ పేద ప్రజలను ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కిషోర్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ వివాదాలకు పరిష్కారం


డ్రోన్ రీసర్వేను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి

బద్వేలు అర్బన్ : వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూ రక్ష పథకంలో భాగంగా చేస్తున్న రీ సర్వేతో భూ వివాదాలకు పరిష్కారం లభించనుందని మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా సోమవారం పట్టణంలో డ్రోన్ ద్వారా చేపట్టిన రీసర్వేను స్థానిక మునిసిపల్ కార్యాలయ ఆవరణ నుంచి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ సర్వే ద్వారా ఎటువంటి సమస్యలు లేకుండా పారదర్శకంగా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. డ్రోన్ సర్వేలో ఇళ్లను, రోడ్లను, ఖాళీ స్థలాలను గుర్తించి హద్దులు ఏర్పాటు చేసేందుకు వీలవుతుందని తెలిపారు. అనంతరం వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీలకు సర్వేపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మునికుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి రత్నరాజు, సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

స్పందనకు అధిక ప్రాధాన్యత


స్పందనలో పాల్గొన్న అధికారులు

గోపవరం : ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజు పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కలిసి స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సమస్య ఏదైనా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. అన్నిశాఖల అధికారులు ఒకేచోట పాల్గొంటున్నందున ఎలాంటి సమస్య అయినా అర్జీ రూపంలో ఇచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అలాగే వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో సమస్య పరిష్కారం కానప్పుడే జిల్లాస్థాయికి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, తహసీల్దారు జీవన్‌చంద్రశేఖర్, ఏపీఓ జయచంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఏఓ అరవిందనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ

ప్రొద్దుటూరు క్రైం : కుటుంబ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జమ్మలమడుగు డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చెన్నమరాజుపల్లెలో కుటుంబ డాక్టర్ విధానం ద్వారా అందిస్తున్న సేవలను ఆమె పరిశీలించారు. ప్రజలకు పరీక్షలు చేసి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారి హనీఫ్‌బాబాకు సూచించారు. డీఈఓ దేవరాజు, 104 డాక్టర్ సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్ వరప్రసాద్, చంద్రకళ, ఆరోగ్య కార్యకర్త యశోద, సుబ్బయ్య, నాగ సుహాషిణి, ఆశా కార్యకర్త బిందు పాల్గొన్నారు.

భక్తులకు నిత్యాన్నదానం

కాశినాయన : మండలంలోని వరికుంట్ల గ్రామ సమీపంలో కొండపైన వెలసిన నీలకంఠేశ్వరస్వామి ఆలయం, కాశినాయన ఆలయాల్లో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా జెడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డిలు ప్రారంభించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థినులకు మెమెంటోలు అందజేస్తున్న పాఠశాల అధికారులు

అట్లూరు : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులు అండర్–19 సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ఆ పాఠశాల స్పెషలాఫీసర్ తనుశ్రీ, పీఈటీ ప్రమీలలు పేర్కొన్నారు. గత నెల 29, 30, 31వ తేదీల్లో అన్నమయ్య జిల్లా చిన్నమండెం ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఎస్.విజయ, చంద్రకళ, క్రిష్ణవేణిలు ప్రథమస్థానం సాధించినట్లు వారు తెలిపారు. విద్యార్థినులకు మెమెంటోలు అందజేసి వారిని అభినందించారు.

నేడు యోగా గురువు భిక్షమయ్య రాక

పోరుమామిళ్ల : శ్రీ సత్యసాయి ధ్యానమండలి వ్యవస్థాపకులు భిక్షమయ్య గురూజీ మంగళవారం పోరుమామిళ్ల వస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొట్టమొదటిసారి పోరుమామిళ్ల వస్తున్న యోగా గురూజీ మంగళ, బుధవారాల్లో ఇక్కడే ఉంటారని, అంతర్ముఖ యోగ శిక్షణ ఇస్తారన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిరసన

ప్రొద్దుటూరు : తెలంగాణ రాష్ట్రం వికారబాద్ జిల్లా నాస్తిక సంఘం అధ్యక్షుడు బైరి నరేష్ హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు.అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మనోహర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.

వృద్ధులకు అన్నదానం

చాపాడు : మండంలోని నక్కలదిన్నె గ్రామానికి చెందిన కెట్టిపల్లె జయమ్మ కుటుంబీకులు సోమవారం చాపాడు సమీపంలోని శ్రీకాశినాయన వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. జయమ్మ 10వ వర్ధంతి సందర్భంగా కుమార్తె స్వాతి, అల్లుడు రఘురామిరెడ్డి ఆశ్రమంలో అన్నదానం చేయటంతో పాటు స్వీట్లు పంపిణీ చేశారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

దువ్వూరు : మండల పరిధిలోని పుల్లారెడ్డిపేటలో ఎంఈఓ కార్యాలయంలో సోమవారం ఏపీటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఎంఈఓ శివజ్యోతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ఏపీటీఎఫ్ అధ్యక్షుడు కొండారెడ్డి, సుభాన్ తదితరులున్నారు.

భూ రీ సర్వే ద్వారా సమస్యలు పరిష్కారం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


సంక్షేమ బావుటా బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : భూ రీ సర్వే ద్వారా భూ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మండలంలోని సగిలిగుడ్డుపల్లె, తాళ్లమాపురం ఎస్సీ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఎమ్మెల్యే రాచమల్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా తమ భూమి ఆన్‌లైన్ కాలేదని ఎన్నో మార్లు అధికారుల వద్దకు తిరిగామని సగిలిగుడ్డుపల్లె గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రస్తుతం ప్రభుత్వం భూ రీ సర్వే చేపడుతోందన్నారు. దీంతో పాటు గ్రామస్తులు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ కొండారెడ్డి తదితరులున్నారు.

అర్హులందరికీ పింఛన్

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి స్పష్టీకరణ


కొత్త పింఛన్లను అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : అర్హత గల ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన నూతనంగా మంజూరైన 864 పింఛన్లను రూ.2750 చొప్పున లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒక సారి నూతన పింఛన్లు మంజూరు చేసే నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ అందాలన్నదే సీఎం లక్ష్యమన్నారు.

ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు


మాధవరాయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సోమవారం సాయంత్రం శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి ఆలయంలో ఉత్తర ద్వార ప్రవేశం చేసి ఎమ్మెల్యే శ్రీదేవి, భూదేవి సమేత మాధవరాయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ చైర్మన్ భూమిరెడ్డి సుబ్బరాయుడు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు ఆలయంలో రూ.1.20 కోట్లతో జరుగుతున్న ప్రహరీ, ఫ్లోరింగ్ పనులను ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పరిశీలించారు. సంక్రాంతి పండుగకల్లా పనులు పూర్తి అవుతాయని ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు డాక్టర్ బద్వేలి సుబ్బరాయుడు, అంకాలుగారి బుజ్జి, శీలం వెంకట్రాముడు ఎమ్మెల్యేకు వివరించారు. ఎల్లంపల్లెలోని తిరుమలనాథ స్వామి ఆలయంలోనూ పూజలు నిర్వహించారు.

అర్హులందరికీ పెన్షన్ల మంజూరు

పీ.ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారుడు నాగార్జునరెడ్డి


కొత్త పెన్షన్‌లను అందజేస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : అర్హులందరికీ ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేస్తున్నదని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారుడు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన పుల్లివీడు సర్పంచుతో కలసి పుల్లివీడు పంచాయతీలో కొత్తగా మంజూరయిన 10 మందికి పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో రెండు పెన్షన్లు ఆగిపోయాయని, దాన్ని విచారించి సరి చేస్తామన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

బద్వేలు : పోరుమామిళ్ల మండలంలోని దమ్మనపల్లెలో నూతనంగా మంజూరైన పింఛన్లను వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం అందజేశారు. పింఛన్ల పండుగలో భాగంగా సచివాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు.